ప్రజాశక్తి
మంగళవారం 9 జనవరి 2024
5
అల్లూరి సీతారామరాజు



ఉద్యోగ, ఉపాధ్యాయులపై నిర్బంధం ఆపాలి

- యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ పోరాటం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులపై పోలీసుల నిర్బంధాన్ని ఆపాలని యుటిఎఫ్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, డిఎ బకాయిలు, ఏపీజిఎల్ఐ, పిఎఫ్ లోన్లు, పార్ట్ ఫైనల్, సరెండర్ లీవ్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ దశల వారీగా పోరాటాలు చేస్తున్నా సమస్యలు పరిష్కారించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు.దీనికి నిరసనగా సోమవారం రాష్ట్ర స్థాయిలో 36 గంటల ధర్నాకు పాల్గొంటున్న ఉపాధ్యాయులపై ప్రభుత్వం పోలీసుల ద్వారా నిర్బంధం పెట్టడం తగదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిఎం జగన్ అనేక హామీలు గుప్పించి అధికారం చేపట్టారని, ఏ ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయ డంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

షోకాజ్ నోటీసుల దగ్ధం

- సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసనలు - ప్రభుత్వ తీరుపై ఆగ్రహం



అరకులోయలో నోటీసులు దగ్ధం చేస్తున్న సురేంద్ర, ఉమామహేశ్వరరావు, నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ గత నెల 20 నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం 20వ రోజు కొనసాగింది. సమ్మెలో భాగంగా ఐటిడిఎ ఎదుట నిరసన దీక్ష కొనసాగించారు. అల్లూరి జిల్లాలో సమ్మె చేస్తున్న 430 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఈనెల 7న సమగ్ర శిక్ష జిల్లా ఆదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సోకాజ్ నోటీసులు వాట్సాప్ ద్వారా జారీ చేశారు. అనుమతి లేకుండా సమ్మె చేస్తున్నారని దీనిపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. దీన్ని నిరసిస్తూ కస్తూర్బా టీచర్లు డీఈవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు.ఐటిడిఎ ఎదుట దీక్ష శిబిరం వద్ద సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సోకజ్ నోటీసుల ప్రతులను దగ్ధం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మండి అనిల్ కుమార్, జైరాజ్ మాట్లాడుతూ, తమ డిమాండ్ల పరిష్కారం కోసం గత నెలలో అధికారులకు నోటీసు ఇచ్చి సమ్మె చేపట్టామని చెప్పారు. సమ్మెపై తమను వివరణ ఇమ్మని నోటీసులు ఇవ్వడం అసమంజసమన్నారు. జిల్లాలోని సమగ్ర శిక్ష లో పని చేస్తున్న కస్తూర్బా టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది మండల కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్పీలు మెసెంజర్లు, భవిత ఆయాలు తదితరులు 430 మందికి ఈ నోటీసులు జారీ చేశారని ఆయన చెప్పారు. మినిమం టైం స్కేల్ అమలు, హెచ్ఆర్ పాలసీ ఇస్తామని, రెగ్యులర్ చేస్తామని సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు కే.కాళిదాస్, కొండబాబు, పి సింహాచలం, ఉపేంద్ర, సిహెచ్. కామేశ్వరరావు, పాడి పంతులు, సుభద్రమ్మ, సుజాత, భారతి తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో నోటీసులు దగ్ధం చేస్తున్న నాయకలు

అరకులోయ: కేజీబీవీ ఉద్యోగుల తొలగింపు నోటీసును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అరకులోయలో ప్రజా సంఘాల నేతలు స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తొలగింపు జీవో కాపీలను దగ్ధం చేశారు. గత కొంతకాలంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సమ్మె చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాల్సిన పోయి ఉద్యోగులపై బెదిరింపులకి పాల్పడుతుందని విమర్శించారు.సిఐటియు, గిరిజన సంఘం ఆధ్వర్యంలో అరకు లోయ లో నోటీసులు దగ్ధం చేశారు.
ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, సమ్మె చేయడం కార్మికుల హక్కు అని అన్నారు. జగన్ కార్మికులు, చిరు ఉద్యోగుల జోలికి వెళ్లి తన గొయ్యితానే తవ్వుకుంటున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సింహాద్రి, కే.మగ్గన్న, ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి.బుజ్జిబాబు, రాము, ఆదివాసి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు జోషి తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: సర్వ శిక్ష అభియాన్, కేజీబీవీ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడాన్ని సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు భీమరాజు తీవ్రంగా ఖండించారు. ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయం ఎదుట ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను, ఆదివాసి గిరిజన మహిళ సంఘం (ఐద్వా) మండల కార్యదర్శి విజయ సోకాజ్ నోటీసులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పి .భీమరాజు, ఎంఎం శ్రీను మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాధ్, జర్రెల ఉప సర్పంచ్ గణపతి పాల్గొన్నారు.

పెదబయలు: కేజీబీవీ పాఠశాల, కళాశాలలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్, ఉద్యోగులపై ప్రభుత్వం ఇచ్చిన సోకాజ్ నోటీసును వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నోటీస్ పత్రాలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ, ఈపీఎఫ్, ఈఎస్ఐ, కనీస టైం స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మాన పడాల్, మండల అధ్యక్షులు బొండా గంగాధరం, కార్యదర్శి సర్బన్న పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రూ.60 లక్షలతో చాపరాయి అభివృద్ధి

-కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: ఆధునీకరించిన చాపరాయి జలపాతాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అరుకు శాసనసభ్యులు చెట్టి పాల్గుణ , ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్‌లు సోమవారం ప్రారంభించారు. చాపరాయిని పర్యాటకులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేసారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ మాట్లాడుతూ, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. చాపరాయి జలపాతం అభివృద్ధికి ప్రత్యేకంగా రూ 60 లక్షల నిధులు కేటాయించి పనులు చేసామని చెప్పారు.చాపరాయి ముఖద్వారం నుండి జలపాతం వరకు మెట్ల మార్గం నిర్మించామని చెప్పారు. జలపాతం సందర్శించే పర్యాటకులకు భోజనాలు చేయడానికి అనుకూలంగా తాగునీటి సౌకర్యం, జలపాతం వద్ద గదులు నిర్మించామన్నారు. జలపాతంలో ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చిన్నపిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేకంగా ఆట పరికరాలను సమకూర్చామన్నారు. చాపరాయి ప్రాంగణంలో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జలపాతం పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా సహకరించాలని కోరారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగు తుందన్నారు.
అరకు శాసనసభ్యులు చెట్టి పాల్గుణ మాట్లాడుతూ, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ప్రత్యేక దృష్టి పెట్టి జలపాతాన్ని అభివృద్ధి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ కె. వేణుగోపాల్, ఎఈఈ అభిషేక్, పద్మాపురం గార్డెన్ ఉద్యానవన అధికారి బొంజుబాబు, మ్యూజియం క్యూరేటర్ మురళి, ఎంపీపీ ఈశ్వరి, చెట్టి వినయ్, జడ్పిటిసి జానకమ్మ, మాజీ ఎంపీపీ దనేరావు, ఎంపీడీవో ఉషారాణి, చెట్టి గోపాల్, వర్తక సంఘం సుమన్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పివిటిజిలకు పథకాలు : పిఒ

ప్రజాశక్తి- అరకులోయ : అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరించి ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న ప్రధానమంత్రి జన జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ అధికారులను ఆదేశించారు. జన్ మన్ కార్యక్రమం ఏర్పాట్లపై కొత్త భల్లుగుడ బాలికలు ఆశ్రమ పాఠశాలలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి పివిటిజి కుటుంబానికి గృహ నిర్మాణం, ఆయుష్మాన్ భారత్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, జల్ జీవన్ మిషన్లో ఇంటింటికి కుళాయిలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. 40 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారందరికీ సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అర్హులందరికీ ఆర్ఓ ఎఫ్ఆర్ పట్టాలు, పీఎం కిసాన్, రైతు భరోసా అందించాలన్నారు.జాబ్ కార్డు లేని కుటుంబాలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు మంజూరు చేయాలని ఆదేశించారు. ముందుగా కొత్త భల్లు గుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె.వేణుగోపాల్, డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్. కుమార్, పంచాయతీరాజ్ ఈఈ టి.కొండయ్య పడాల్, తహశీల్దార్ వేణు, ఎంపిడిఓ వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిఒ అభిషేక్

టిడిపి పథకాలపై ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి- చింతపల్లి : బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా తెలుగుదేశం పార్టీ తీసుకు వచ్చిన సూపర్ సిక్స్ పథకాలపై ఆ పార్టీ పాడేరు నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి అవగాహన కల్పించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో తాజంగిలో పాడేరు నియోజకవర్గం పరిశీలకులు రాజమండ్రి నారాయణతో కలిసి ప్రచారం చేపట్టారు. భవిష్యత్ గ్యారంటీ కార్డులను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఆంద్రాబు లక్ష్మణ్, నాయకులు పరమేశ్వరరావు, గోసరెడ్డి సోమేశ్వరరావు, పురుషోత్తం, సుందరరావు పాల్గొన్నారు.



ప్రచారం చేపడుతున్న నియోజకవర్గ ఇన్చార్జి ఈశ్వరి

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు, అంగన్వాడీలు

ప్రజాశక్తి- రంపచోడవరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్వాడీ కార్యకర్తల దీక్షా శిబిరం వద్ద ప్రజాశక్తి 2024 నూతన సంవత్సర కేలండర్‌ను సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆవిష్కరించారుకార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు కె రామలక్ష్మి , రెండు మండలాల అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ మినీ అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుదుత్పత్తిలో శతశాతం లక్ష్యసాధన

కార్మికులకు జీతంతో ఐదు శాతం అలవెన్స్

ఎపి జెన్‌కో సీలేరు ప్రాజెక్టు ఇఇ లక్ష్మినారాయణ



ఇఇ ఈశ్వరరావు

ప్రజాశక్తి -సీలేరు: ఎపి జెన్‌కో సీలేరు జల విద్యుత్ కేంద్రంలో అన్ని యూనిట్లులో ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా 2022-23 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 31 నాటికి శతశాతం విద్యుదుత్పత్తి చేపట్టామని ఎపి జెన్‌కో ఇఇ లక్ష్మీనారాయణ వెల్లడించారు. సోమవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ విద్యుదుత్పత్తిలో శతశాతం లక్ష్యాన్ని పూర్తి చేయడంతో సీలేరు జలవిద్యుత్ కేంద్రం పరిధిలోని కార్మికులకు ఈ నెలలో జీతంతో పాటు ఐదు శాతం అలవెన్స్‌ను జెన్‌కో యాజమాన్యం అందజేస్తుందని తెలిపారు.గడచిన నాలుగేళ్లతో పోల్చుకుంటే సీలేరు జల విద్యుత్ కేంద్రంలో అన్ని విద్యుదుత్పత్తి యూనిట్లు ఎటువంటి లోపాలు లేకుండా గ్రిడ్‌కు అందుబాటులో ఉంచామన్నారు. తన పర్యవేక్షణలో ఎపీ జెన్కో ఇంజనీర్లు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, కాంట్రాక్టర్ల మంచిపనితీరు కనబరచడంతో ఈ ఏడాది లక్ష్యాన్ని సాధించుకోగలిగామని ఇఇ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎప్పటికప్పుడు యూనిట్లలో లోపాలు సవరిస్తూ విద్యుదుత్పత్తికి చేపట్టడం, గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేయడంతో ఇది సాధ్యమైందన్నారు. గత ఏడాది 2022 జనవరి నుంచి డిసెంబరు చివరినాటికి 99.5 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని,అధికారులు విద్యుత్ ఉత్పత్తి నిర్దేశించిన లక్ష్యానికి మూడు నెలలు గడువు ఉన్నప్పటికీ, యూనిట్లు ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ఎటువంటి అవాంతరాలు లేకుండా చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు.

విద్యుదుత్పత్తి లక్ష్యసాధన

సంవత్సరం	విద్యుదుత్పత్తి
2019	87.75 శాతం
2020	73.03 శాతం
2021	78.47 శాతం
2022	99.5 శాతం
2023	100 శాతం

సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో గడచిన నాలుగేళ్లలో అన్ని యూనిట్లులో ఆయా ఏడాది డిసెంబర్ 31నాటికి చేపట్టిన విద్యుదుత్పత్తి లక్ష్యాల వివరాలు ఇలా ఉన్నాయి. 2019లో డిసెంబర్ 31నాటికి 87.75శాతం, 2020లో 73.03శాతం, 2021లో 78.47శాతం, 2022లో 99.5శాతం, ఈ ఏడాది 2023లో డిసెంబర్ 31నాటికి శతశాతం విద్యుదుత్పత్తి లక్ష్యాలను సాధించామని ఇఇ లక్ష్మీనారాయణ తెలిపారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

మోతుగూడెం జెన్‌కో సిఇ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన

ప్రజాశక్తి - సీలేరు/మోతుగూడెం : సీలేరు కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న ఎపి జెన్‌కో కాంట్రాక్ట్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రెగ్యులర్ చేయాలని సీలేరు కాంట్రాక్ట్ కార్మిక సంఘ బ్రాంచి అధ్యక్షుడు బి. లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మోతుగూడెం చీఫ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షల్లో సీలేరు డొంకరాయి, మోతుగూడెం విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులందరినీ చేయాలని పీస్ రేట్ వర్కర్‌ను మ్యాన్ పవర్ గుర్తించాలని దీక్ష ప్రారంభంలో నినాదాలు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తెలంగాణ తరహాలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ డైరెక్ట్ పేమెంట్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలోనూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 2022 పిఆర్‌సి ప్రకారం వేతనాలు, ఏరియల్స్ చెల్లించాలని, మహిళలకు సంవత్సరానికి ఐదు సెలవులు ఇవ్వాలని, ఇఎస్ఐ ద్వారా కాంట్రాక్ట్ కార్మికులకు మెడికల్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్లు నెరవేర్చుకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని చీఫ్ ఇంజనీర్ బి. శ్రీధర్‌కు అందజేశారు. దీక్షల్లో సిఐటియు రీజనల్ అధ్యక్ష కార్యదర్శులు వివి .రమణ, జె.రత్నాకర్, చింతా రాంబాబు, రంపచోడవరం డివిజన్ జిల్లా కార్యదర్శి వెంకట్, సిపిఎం సీనియరు నాయకులు వై. శ్రీనివాస్, సీలేరు సిఐటియు బ్రాంచ్ గౌరవాధ్యక్షులు ఎస్ కె. సుభాను, కాంట్రాక్ట్ కార్మిక సంఘ కార్యదర్శి విష్ణు కుమార్, సిపిఎం మండల నాయకులు పల్లపు వెంకట్, ఎర్రంశెట్టి శ్రీనివాస్, సిఐటియు నాయకులు జై రత్నాకర్ , చింతా రాంబాబు, బివి.రమణ, మరియు 1104 యూనిట్స్ కిరణ్, సతీష్, మల్లికార్జున్, సీలేరు కాంప్లెక్స్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు, సంఘ నాయకులు సిఐటియు నేతలు

అవస్థల పాల్జేశారు...

- పింఛన్ల కోసం రోజంతా ఆకలితో పడిగాపులు
- పొద్దుపోయాకగానీ రాని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు
- ఒట్టిచేతులతోనే వెనుదిరిగిన లబ్ధిదారులు



ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ రాకపోవడంతో నిరాశగావెనుదిరిగి పోతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - విఆర్.పురం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ పింఛన్ల పంపిణీని ఒక ప్రచార వేదికగా మార్చేసిన ప్రభుత్వం, జనవరి నెలలో పెంచిన ఆర్థికసాయం పేరుతో లబ్ధిదారులను అగచాట్లకు గురిచేస్తోంది. ప్రతినెలా ఒకటి రెండు తేదీల్లో ఇంటి వద్దకే వాలంటీరు తెచ్చి ఇచ్చిన పింఛను ఈనెలలో ఎనిమిదో తేదీకి కూడా లబ్ధిదారులకు అందకపోగా, వృద్ధులు, మహిళలు, వికలాంగులు అనే తేడా లేకుండా లబ్ధిదారులను కిలోమీటర్ల కొలది దూరం రప్పించి అవస్థలకు గురిచేస్తున్నారు. విఆర్.పురంలోనూ పింఛన్లపంపిణీ ఇలాగే లబ్ధిదారులను నానా ఇబ్బందులకు గురిచేసింది. ఉదయం పదిగంటలకే సభ వద్దకు రావాలని హుకుం జారీ చేయడంతో కొన్ని గ్రామాల లబ్ధిదారులంతా పడవలు మీద నదిని దాటి, అక్కడ నుంచి ఆటోల్లోనూ, ఇంకా కాలినడకన ఇలా నానా ఇబ్బందులు పడుతూ ఉదయం పది గంటల్లోపే పింఛన్లు పంపిణ వేదిక మండల కేంద్రంలోని కెవిఆర్ కాలేజీ వద్దకు చేరుకోగా, అక్కడ టెంట్ కుర్చీలు తప్ప ఇతరత్రా ఎటువంటి ఏర్పాట్లు లేవు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తామని ప్రకటించారు. సాయంత్రం నాలుగు గంటలు దాటినప్పటికీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు రాకపోవడంతో పింఛన్లు పంపిణీ ప్రారంభించలేదు ఉదయాన్నే వచ్చిన వృద్ధ, వితంతు మహిళలు, వికలాంగులు ఇతరత్రా లబ్ధిదారులంతా గంటల తరబడి ఆకలిలో అటమటిస్తూ నేతల రాకకోసం ఎదురుచూసి, పొద్దుగూకుతున్నప్పటికీ పత్తా లేకపోవడం, చీకటి పడితే తమ గ్రామాలకు రవాణా సౌకర్యం లేనిపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఒట్టి చేతులతో వెనుదిరిగారు. 20- 30 కిలోమీటర్ల దూరం నుండి సభ తీసుకొచ్చిన తమకు మంచినీరు తప్ప, కనీస సౌకర్యాలు కల్పించలేదని అవ్వాతాతలు విలవిల్లాడిపోయారు. పోనీ బయటకు వెళ్లి కొని తిందామన్నా అక్కడ అటువంటి సౌకర్యం లేకపోవడంతో ఆకలితో అలమటించిపోయారు. సభకు వచ్చేందుకు ఎన్ని అవస్థలు పడ్డారో, పొద్దుగుంకిన తర్వాత అక్కడి నుంచి వెనుదిరిగడంతో ఇళ్లకు చేరడమెలాగని ఆవేదన వ్యక్తం చేశారు. తీరా దాదాపు అందరు లబ్ధిదారులు వెనుదిరిగిన తర్వాత సాయంత్రానికి తీరికగా అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబులు అక్కడున్న నలుగురైదుగురికి పింఛన్లు ఇచ్చి తంతు ముగించారు. కాగా లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేసిన అధికారులు, నేతల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

సిఆర్‌పిలకు యుటిఎఫ్ చేదోడు



సాయం అందిస్తున్న కవిత

ప్రజాశక్తి- చింతూరు: నాలుగు నెలలుగా జీతాలు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మండల విద్యా వనరుల కేంద్రంలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు యుటిఎఫ్ చింతూరు మండల శాఖ అండగా నిలిచింది. సోమవారం స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో ఏడుగురు సిఆర్‌పిలకు జిల్లా అసోసియేట్ ఎం కవిత ఆధ్వర్యంలో ఒక్కొక్కరికీ 25 కేజీల బియ్యం, నిత్యావసరాలతోపాటు చెరో రూ.రెండు వేలు నగదును సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పిలుపును అందుకుని సాయంలో భాగస్వాములైన ఉపాధ్యాయులందరికీ చింతూరు మండల శాఖ తరుపున కవిత అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి. కృష్ణయ్య, యు. వెంకటనారాయణ గారు, యుటిఎఫ్ అధ్యక్షులు ఏం. సోమరాజు, ప్రధాన కార్యదర్శి బి. ముత్తయ్య, కె.. తులసమ్మ, ఏం. గంగాదేవి, కె. బ్రహ్మయ్య, కె. భీమయ్య, సిఆర్‌పిలు బి. బాలు, ఏం.రవి,బి వెంకట్, ఎన్న. నరేష్, ఎస్. సూర్యప్రకాశ్,రాము పాల్గొన్నారు.

గాయపడిన టీచర్‌కు ఆర్థిక సాయం



శ్రీనివాస్‌రెడ్డి సోదరికి ఆర్థికసాయం అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి- విఆర్.పురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని ఎస్.ఇప్పురు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ముర్లా శ్రీనివాస్ రెడ్డికి యుటిఎఫ్ ఆర్థికసాయాన్ని అందజేసింది. పాఠశాలలో విధులకు హాజరయ్యేందుకు వస్తున్న సమయంలో జరిగిన రోడ్డుప్రమాదంలో శ్రీనివాస్‌రెడ్డి అదుపుతప్పి తూలిపడడంతో మెడ నరాలు చిట్లి శరీరంలోని కాళ్లు,చేతులు కదలికలు లేకుండాపోయాయి. ప్రస్తుతం కాకినాడలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు శ్రీనివాసరరెడ్డి వైద్యఖర్చులకు తమ వంతుసాయంగా విఆర్ పురం మండల శాఖ ఉపాధ్యాయుల సహకారంతో రూ.32,500 విరాళం సమకూర్చి, ఆయన సోదరి ఎం సుబ్బలక్ష్మికి అందజేశారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్ నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు కె.వెంకట్ ప్రధాన కార్యదర్శి ఎన్ జగదీష్, మండల సహ అధ్యక్షులు ఒ.మంగారావు రెడ్డి, మండల కోశాధికారి ఎం బాబు, మండల కార్యదర్శి ఎన్ రామకష్ణ కాంప్లెక్స్ కార్యదర్శి ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్మాకు భయపడేది లేదు

కొనసాగిన అంగన్వాడీల నిరసనలు
జిఒ 2 ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి-యంత్రాంగం
పాడేరు: సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ అంగన్వాడి వర్కర్లు చేపట్టిన సమ్మె సోమవారం 28వ రోజు కొనసాగింది సమ్మెలో భాగంగా ఐటిడిఏ ఎదుట వివిధ మండలాల నుంచి అంగన్వాడీ వర్కర్లు అధిక సంఖ్యలో హాజరై నిరవధిక దీక్ష నిర్వహించారు. మరోవైపు ఐసిడిఎస్ అధికారులు దీక్ష శిబిరం వద్దకు వచ్చి విధుల్లో చేరాలంటూ అంగన్వాడీలపై ఒత్తిడి చేశారు. నోటీసు ఇచ్చేందుకు ప్రయత్నం చేశారు. పాడేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి రూప్సీ సూపర్వైజర్తో దీక్షా శిబిరానికి వచ్చి అంగన్వాడి కార్మికులు రేపటి లోపు విధుల్లో చేరకపోతే తొలగిస్తామని చెప్పి ఉత్తర్వులు ఇచ్చేందుకు ప్రయత్నం చేశారు. కార్మికులు ఎవరు కూడా ఉత్తర్వులు తీసుకోలేదు. ఉత్తర్వులు తీసుకోకపోవడంతో చేసేది లేక వెంటు ఆవరణలో ఉన్న కరెంటు స్తంభం పై అతికించి వెళ్లారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె విరమించేది లేదని, ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి డివిజన్ నాయకులు చిన్నారి, దేవి, భాగ్య, జయ, అంబిక, సత్యవతి, వెంకటలక్ష్మి, లక్ష్మీభారతి, విమల సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు. సుందరరావు పాల్గొన్నారు.

అనంతగిరి: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కనీస వేతనం, ఇతర సమస్యలు పరిష్కరించకుండా ఎస్మా చట్టం ప్రయోగించడం ఎంతవరకు సమంజసమని స్థానిక జెడ్పిటిసి. దీసరి గంగరాజు ప్రశ్నించారు. సిఐటియు ఆధ్వర్యాన అంగన్వాడీలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమ్మె శిబిరం నుండి ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వరకు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గంగరాజు మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీ యూనియన్ నాయకులు కొర్రా లక్ష్మి, పి.మంజుల మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలకు గ్యాస్ను తమ డబ్బులతోనే తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కిల్లో మోస్య, సిపిఎం మండల కార్యదర్శి సోమెల, నాగులు, అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.మంజుల, కొర్రా లక్ష్మి రమణమ్మ పార్వతి, సుమిత్ర, చిట్టమ్మ రాజేశ్వరి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు : మండల కేంద్రంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సమ్మె కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నేత సన్నిబాబు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు టి.రాజమ్మ, మంగమ్మ, వరహాలమ్మ, భవాని, సరస్వతి, దేవి, శాంతి, కొండమ్మ, వరహాలమ్మ, పద్మ పాల్గొన్నారు.

చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన
దుంబ్రిగుడ: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ కార్మికులు మండల కేంద్రంలోని హైవే రోడ్డు యూనియన్ జంక్షన్ వద్ద సోమవారం చెవిలో పువ్వులు పెట్టుకొని ఆందోళన చేస్తూ ప్రభుత్వానికి నిరసనను తెలియజేశారు. తమ సమస్యలను పరిష్కరించకుండా, ఎస్మా ప్రయోగించడం సరికాదంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే.కొండమ్మ, కే.సత్యవతి, జి పవిత్ర, అంగన్వాడి కార్మికులు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

ముంచింగి పుట్టు: మండలకేంద్రంలో ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సమ్మె కొనసాగింది. అంగన్వాడిల యూనియన్ నాయకులు కాంతమ్మ, ఈశ్వరి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్రా త్రినాథ్, ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను మాట్లాడుతూ, ఎస్మా చట్టాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. జీవో 2 కాపీలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడిల యూనియన్ నాయకులు పార్వతి, సుజాత, భవాని, అంగన్వాడి కార్యకర్తలు, మినీ, ఆయాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ముంచంగిపుట్టులో జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న అంగన్వాడీలు

రాజవొమ్మంగి: అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా 28వ రోజున సోమవారం నల్ల చీరలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్మా చట్టం జీఓ ప్రతులను స్థానిక అంబేద్కర్ విగ్రహానికి అందజేశారు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదించారు స్థానిక ఆర్అండ్బి అతిథి గృహం ఎదురుగా అంగన్వాడీల సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి కిరణ్, గిరిజనసంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్వాడీల సమస్యకు పరిష్కారం చూపకుండా వారిపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమన్నారు. గతంలో ఎస్మాను ప్రయోగించిన ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోయాయని గుర్తుచేశారు. అంగన్వాడీలకు మద్దతుగా ఈ నెల 9న జైల్భరో కార్యక్రమాన్ని నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు తీర్మానించాయన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ కుమారి, కె వెంకటలక్ష్మి, గిరిజన సంఘం, సిఐటియు, డివైఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు, కె జగన్నాథం, కె సూరిబాబు, పి రామరాజు, టి శ్రీను, పి పాపారావు, పి సత్యనారాయణ, పి రాంబాబు, అంగన్వాడి యూనియన్ నాయకులు ఎల్ సత్యవతి, నూకరత్నం, కె లక్ష్మి, చిన్నమ్మలు, రమణి, రమణ, రత్నం, రాజేశ్వరి, మంగ, రాధ, భవాని పాల్గొన్నారు.

అడ్డతీగల: అంగన్వాడీలపై ప్రభుత్వం మొండివైఖరివీడి, జిఒ 2ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ స్థానికసెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకురాలు బి నిర్మల, బేబీ రాణి పాల్గొన్నారు


రాజవొమ్మంగిలో మద్దతు తెలుపుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

సీలేరు: అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగిస్తామని ఇచ్చిన నోటీసులకు భయపడేది లేదని సిఐటియు నాయకులు సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం జీకే వీధిలో అం గన్వాడీ దీక్షలు కొనసాగాయి. జిఒ 2 నోటీసులను దగ్ధం చేశారు. గాలికొండ సిపిఎం ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు అంగన్వాడీలకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘ అధ్యక్షులు ఎన్. చంటిబాబు కొర్ర. బాలయ్య గమ్మెల. పరమేశ్వరరావు పాల్గొన్నారు.

చింతూరు :28వ రోజు సమ్మెలో యూనియన్ కార్యదర్శి నూకరత్నం, అధ్యక్షులు వెంకటరమణ ఆధ్వర్యంలో జిఒ 2 ప్రతులను దగ్ధం చేశారు. ఎస్మా ప్రయోగానికి భయపడేది లేదని, ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి కామేశ్వరి. యూనియన్ సభ్యులు. జయ. కన్నకదుర్గ. చిట్టమ్మ. చుక్కమ్మ. సత్యవతి. విజయకుమారి. భద్రమ్మ. దుర్గ. పాల్గొన్నారు.

విఆర్ పురం: మండలంలోని రేఖ పల్లి జంక్షన్ వద్ద అంగన్వాడీ సమ్మెకు రైతు సంఘ మండల అధ్యక్షులు పంకు సత్తిబాబు మండల కార్యదర్శి వడ్లాది రమేష్ సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు ఆస్ మాజీ సర్పంచ్ లక్ష్మణ్.. గిరిజన సంఘ మండల కార్యదర్శి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనం సత్యనారాయణ. జిల్లా అధ్యక్షులు సున్నం రంగమ్మ మండల అధ్యక్షులు నాగమణి మండల కార్యదర్శి రాజేశ్వరి. కుంజ నాగిరెడ్డి సత్యనారాయణ లక్ష్మణరావు సోడి మల్లయ్య పాల్గొన్నారు.

కూనవరం :అంగన్వాడీల సమ్మెపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య అన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాసంఘాలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.


రంపచోడవరం : అంగన్వాడీ వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 28వ రోజున దీక్షలను సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ ప్రారంభించారు అంగన్వాడి వర్కర్స్ యూనియన్ కోశాధికారి రామలక్ష్మి, అంగన్వాడి వర్కర్స్ మినీ అంగన్వాడీలు, వర్కర్ హెల్పర్లు పాల్గొన్నారు.


అనంతగిరిలో ర్యాలీ, మానవహారంనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జెడ్పిటిసి సభ్యులు గంగరాజు


రంపచోడవరంలో దీక్షలో కూర్చున్న అంగనవాడీలు

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి జిల్లా చైర్పర్సన్ సుభద్ర పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపీడీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ, అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని తెలిపారు. 12 గంటల సమయంలో ఉమ్మడి జిల్లాల చైర్పర్సన్ సుభద్ర రావడంతో పెన్షన్ పెంపు కార్యక్రమాన్ని ఆదరాబాదరగా హడావుడిగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సీతమ్మ, వైసీపీ మండల అధ్యక్షులు మల్లికార్జున్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

20న అరకులోయకు చంద్రబాబు రాక

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయకు ఈనెల 20న తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రానున్నారని అరకు అసెంబ్లీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అన్నారు. అరకులోయ సమీపంలోని ఉషోదయ రిసార్ట్స్ ఆవరణలో సోమవారం తెలుగుదేశం పార్టీ అరకు ఇన్చార్జ్ సియ్యారి దొన్నుదొర ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు, పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నాయకుల్లో కార్యకర్తల్లో నెలకొన్న చిన్నచిన్న విభేదాలు విడిచిపెట్టి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. పార్టీ గెలిస్తేనే అందరికీ గౌరవం దక్కుతుందన్నారు. అరకు నియోజవర్గం టిడిపి పార్టీ ఇన్చార్జి సియ్యారి దున్నుదొర మాట్లాడుతూ, 2024 ఎన్నికల్లో టిడిపి విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. అరకులోయ పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసు బాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఇంచార్జ్ నాగేశ్వరరావు, ఆరు మండలాలకు చెందిన టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


పింఛను పంపిణీ చేస్తున్న సర్పంచ్ మాధవరావు

సీతగుంటలో గ్రామసభ

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీలో గ్రామసభను సర్పంచ్ పి.మాధవరావు అధ్యక్షతన నిర్వహించారు. అభివృద్ధి పనులపై తీర్మానం చేశారు. నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కె.బొంజుబాబు, వైస్ ప్రెసిడెంట్ గంగాధరం పాల్గొన్నారు.

ఉత్సాహంగా యువభేరి

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్(యూనిఫెస్ట్) 2023-24 ఉత్సహభరిత వాతావణంలో నిర్వహిస్తున్నారు. నాల్గవరోజున యువ భేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం వెస్టన్ గ్రూప్ సాంగ్, మైమ్, క్లాసికల్ వోకల్ సోలో, కార్టూనింగ్, డిబేట్ పోటీలు, మధ్యాహ్నం ఫోక్-ట్రైబల్ డాన్స్, క్లాసికల్ డాన్స్, ఇనస్టలేషన్, స్కిట్, మెహందీ పోటీలను నిర్వహించారు. అన్ని విభాగాలలో పోటీలు సోమవారంతో ముగిశాయి.


రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన వైద్యశిబిరం

ప్రజాశక్తి -సీలేరు: వై రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ బచ్చులూరులో సీలేరు జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దత్తత గ్రామం బచ్చులూరులో సీలేరు పిహెచ్సి వైద్యాధికారి స్వామి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి, 45 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజలకు ఆరోగ్య సూచనలు చేశారు. మారుమూల గ్రామాల్లో వైద్య, ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలకు గిరిజనులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యారాణి సీలేరు పిహెచ్సి వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం విశాఖలోని గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా వున్న ఎస్ఇ ఆఫీస్ వద్ద ధర్నా జరిగింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి.కుమార్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. విద్యుత్ సవరణ చట్టం 2020ని రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేయాలని, మీటర్ రీడర్స్కు ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిదినాల కుదింపు ఆపాలని, పీస్రేట్ రద్దు చేయాలని, నెలవారీ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్టోర్స్లో పనిచేస్తున్న హామాలీలకు కూడా పీస్ రేటు రద్దు చేసి నెలవారీ జీతాలు ఇవ్వాలన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు, సెక్షన్ ఆపరేటర్లు, కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, వాచ్మ్యాన్లకి షిఫ్ట్ ఆపరేటర్లుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు పెట్టి మీటర్ రీడర్లను ఉద్యోగాల నుంచి తొలగించే చర్యలను మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు అవతారం, మహేష్, శ్రీను, రాజులతోపాటు షిఫ్ట్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

జివిఎంసి ప్రాజెక్టుల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి చేపడుతున్న పలు ప్రాజెక్టులను ట్రైనీ ఐఎఎస్లు సోమవారం పరిశీలించారు. వారికి అన్నింటినీ చక్కగా వివరించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రాజెక్టు ఆఫీసర్ బంటు సన్యాసినాయుడు, పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్ కుమార్, కెవిఎన్.రవి, కృష్ణారావులను ఆదేశించారు. సోమవారం విశాఖ నగరానికి విచ్చేసిన 18 మంది 2022 బ్యాచ్ ట్రైనీ ఐఎఎస్లకు జివిఎంసి అధికారులు నగరంలో చేపడుతున్న పలు ప్రాజెక్టులను చూపించారు. ముఖ్యంగా కాపులుప్పాడలో జిందాల్ చేపడుతున్న చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్రాజెక్టుపైనా, ఫ్లోటింగ్ సోలార్ వ్యవస్థపైనా, ఎంవిపిలోని స్పోర్ట్స్ ఎరీనా తీరుపైనా వివరించారు. నగరంలోని వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డ్కు తరలించి, ఆ చెత్త నుంచి విద్యుత్తు తయారు చేస్తున్నట్టు తెలిపారు. తద్వారా నగరంలో కాలుష్యం తగ్గడమే కాకుండా నగర అవసరాలకు విద్యుత్ను వినియోగించవచ్చునన్నారు.

ఓట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అక్రమంగా ఓట్లు తొలగించిన వారిపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.మల్లికార్జునకు సోమవారం ఆయన వినతి పత్రం సమర్పించారు.

మున్సిపల్ కార్మికుల చలో కలెక్టరేట్

అడ్డుకున్న పోలీసులు, సరస్వతీ పార్కు వద్ద తోపులాట
300 మంది అరెస్టు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్
తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ జివిఎంసి పరిధిలోని మున్సిపల్ కార్మికులు సోమవారం చేపట్టిన చలో కలెక్టరేట్ను పోలీసులు భగ్నం చేశారు. సరస్వతి పార్కు నుంచి ర్యాలీగా కార్మికులు బయలుదేరగా పోలీసులు భారీగా మోహరించి అడ్డుకున్నారు. కార్మికులు వారిని తీవ్రంగా ప్రతిఘటించి కలెక్టరేట్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు 300 మందిని అరెస్టు చేసి పోలీసు బ్యారెక్స్ ప్రాంతంలోని కళ్యాణ మండపానికి తరలించారు. అరెస్టయిన వారిలో జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు, నాయకులు ఎస్.రమణ, ఎం.ఈశ్వరరావు, జెఆర్.నాయుడు, రత్నం, యుజిడి వర్కర్స్ యూనియన్ నాయకులు ఇ.ఆదినారాయణ ఉన్నారు. వారందరినీ పోలీసులు సాయంత్రం విడిచిపెట్టారు.


మున్సిపల్ కార్మికులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఉద్యమం ఉధృతం : నాయకులు
తొలుత సరస్వతీ పార్కు వద్ద జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సభ చేపట్టగా వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు. వారినుద్దేశించి యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 రోజులుగా సమ్మె జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. చర్చల సందర్భంలో ప్రభుత్వం ముఖ్యమైన డిమాండ్లను నెరవేర్చలేదన్నారు. ఉద్యమాన్ని పోలీసులతో అణగదొక్కే ప్రయత్నం చేయడం అవివేకమే అవుతుందని తెలిపారు. కనీస వేతనం, కార్మికులను రెగ్యులర్ చేయడం వంటి హామీలను నెరవేర్చే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. రానున్న కాలంలో ఉద్యమం మరింత ఉధృతమవుతుందని స్పష్టం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మున్సిపల్ కార్మికులకు సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించారు. టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్ఛార్జి ఎం.శ్రీభరత్, దక్షిణ నియోజకవర్గ ఇన్ఛార్జి గండి బాబ్జీ కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. జగన్ హామీల పేరిట ఎలా మోసగించిందీ తెలిపారు.


సభలో మాట్లాడుతున్న సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

స్టీల్ప్లాంట్ను ప్రైవేటీకరిస్తే ఊరుకోం

ప్రజాశక్తి - కలెక్టరేట్
విశాఖ స్టీల్ప్లాంట్ను ప్రైవేట్ సంస్థలకు అమ్మివేస్తే చూస్తూ ఊరుకునేది లేదని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు గొలగాని అప్పారావు, సిఐటియు నాయకులు కొవిరి అప్పలరాజు అన్నారు. స్టీల్ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 1012వ రోజుకు చేరాయి.

దీక్షల్లో సిఐటియు గాజువాక జోన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించని మోడీ ప్రభుత్వానికి వాటిని అమ్మే హక్కు లేదన్నారు. దీక్షల్లో ఈశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్ల కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ద్వారకానగర్ 4, 5 లైన్ల తోపుడుబండ్లు, బడ్డీల చిల్లర వర్తక కార్మికులు సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి విశాఖపట్నం తోపుడుబండ్ల కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి ఎ.సింహాచలం మాట్లాడుతూ తొలగించిన తోపుడుబండ్లను తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టం ప్రకారం ఎక్కడ బతికే తోపుడు బండ్లు, బడ్డీలు, చిల్లర వర్తకలను అక్కడే బతకనీయాలని చట్టం చెబుతుందన్నారు. సంఘం మద్దిలపాలెం జోన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు మాట్లాడుతూ తోపుడు బండ్లు, బడ్డీల చిల్లలవర్తకులపై జివిఎంసి అధికారులు, సచివాలయ ఉద్యోగుల దాడులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో తోపుడు బండ్లు, బడ్డీల కార్మికులు ఆర్.శ్రీను, వెంకటరెడ్డి, రాజి, రాము తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న పిఒ, ఇతర అధికారులు

స్పందన సమస్యల సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - రంపచోడవరం : స్పందనలో వచ్చిన వ్యక్తిగత, సామాజిక సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతున్నట్లు ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే తెలిపారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో స్పందనలో కార్యక్రమం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గానోరే, సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్కుమార్, ఎపిఒ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులతో కలిసి వినతులను స్వీకరించారు. ఈ వారం స్పందనలో 32 దరఖాస్తులు వచ్చాయని పిఒ సూరజ్ గనోరే తెలిపారు. రంపచోడవరం మండలంలోని కాకివాడ నుండి కొయ్యలగూడెం గ్రామం వరకు మంజూరైన తొమ్మిది కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణ పనులు మూడు కిలోమీటర్ల మాత్రమే జరిగి, అటవీశాఖ అభ్యంతరాలతో మిగిలిన ఆరు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం ఆగిపోయందని, దీనికి వెంటనే క్లియరెన్స్ ఇప్పించాలని ఆకూరు సర్పంచ్ పండ్ర సరస్వతి, ఎంపిటిసి నర్రి పాపారావు, సూండ్రు అబ్బాయిరెడ్డి, కామారపు చంద్రారెడ్డి, మరో 50 మంది దరఖాస్తు సమర్పించారు. రంపచోడవరం మండలం వేములకొండ గ్రామం నుండి దేవీపట్టణ మండలం తున్నూరు గ్రామం వరకు మూడు కిలోమీటర్ల రహదారిని తారు రోడ్ ఏర్పాటు చేయాలని కోరారు. తున్నూరు పంచాయతీలోని చింతలగూడెం, మామిడివలస, బడి గుంట, తున్నూరు ఐదు గ్రామాలకు సంబంధించిన ప్రజలకు మండలంలోని పెద గెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించాలని తున్నూరు సర్పంచ్ సాదల విజయభాస్కర్ రెడ్డి, పల్లాల విశ్వనాథరెడ్డి, పల్లాల లచ్చిరెడ్డి అర్జీ సమర్పించారు మారేడుమిల్లి మండలం సిరిపురం గ్రామంలోని పదిమంది గిరిజన రైతులకు సుమారు 70 ఎకరాల వరి సాగు చేసుకొనుటకు10 పవర్ టిల్లర్లు సబ్సిడీపై మంజూరు చేయాలని సుండం సత్యనారాయణ దొర, గుబతాల చంద్ర మాణిక్యాలరావు, చుండం వీరస్వామి దరఖాస్తు సమర్పించారు, రంపచోడవరం మండలంలోని పాత గాంధీ నగరంలో సర్వే నెంబర్ 6/3బి 1 సుమారు రెండున్నర ఎకరాల భూమి సమస్య పరిష్కరించాలని కురుసం అబ్బాయి దొర దరఖాస్తు సమర్పించారు, రంపచోడవరం మండలం బీరంపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 6/1 సుమారు 9 ఎకరాల భూమికి సంబంధించిన సమస్య పరిష్కరించాలని చోడి బాపిరాజు, చెదల లచ్చిరెడ్డి దరఖాస్తు సమర్పించారు. కార్యక్రమంలో ఎస్డిసి డిఎస్ శాస్త్రి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అబు సలాం, ఎడిఎంహెచ్ఒ జి. ప్రకాశం, వెలుగు ఎపిడి ఎ. శ్రీనివాసరావు, డిఎల్పిఒ రాఘవన్, ఇఇలు జి. డేవిడ్రాజ్, ఎండి. యూసఫ్, సుబ్బయ్య, ఎ. రవికుమార్, ఎడిఎ సిహెచ్కెవి చౌదరి, సావిత్రి, పిఎఒ రాంబాబు, డాక్టర్ ఇందిర పాల్గొన్నారు.

వినికిడి లోపం గుర్తించే యంత్రం ప్రారంభం

ప్రజాశక్తి - రంపచోడవరం : నవజాత శిశువులకు వినికిడి శక్తిలోపాన్ని గుర్తించే ఓటో ఏకోస్టిక్ ఏమిషన్ పరికరాన్ని స్థానిక ఏరియా హాస్పిటల్లో రంపచోడవరం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ కె.లక్ష్మి, ఇఎన్టి డాక్టర్ ఎవి క్రాంతి కిరణ్, పీడియాట్రీషియన్ డాక్టర్ ఎం.ఆదిలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇఎన్టి వైద్యుడు డాక్టర్ క్రాంతికిరణ్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుండి నాలుగేళ్లలోపు పిల్లల్లో వినికిడి లోపాన్ని గుర్తించి తద్వారా మెరుగైన చికిత్స అందించేందుకు ప్రభుత్వం ఈ పరికరాన్ని సమకూర్చిందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద ఆటో కార్మికులు విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ ఆటోరిక్షా కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి.జగన్, ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడారు.